కోట్లు వెచ్చించారు.. నిర్వహణ మరిచారు

- బోసిపోతున్న పార్కులు, జంక్షన్లు
- ప్రారంభోత్సవానికే పరిమితమైన మల్టీపర్పస్ పార్కు
- బల్దియా తీరుపై నగరవాసుల అసంతృప్తి



కళ తప్పిన తెలంగాణ చౌక్ జంక్షన్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీ, పట్టణ ప్రగతి నిధులతో కరీంనగర్‌ను సుందరంగా తీర్చిదిద్దాం.. భారీగా నిధులు వెచ్చించి రోడ్లు, జంక్షన్లు, పార్కులు, ఓపెన్ జిమ్స్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు అభివృద్ధి చేశామని చెబుతున్న అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలిపెట్టారు. దీంతో ప్రజలు అధికారులతీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గత నెల 28వ తేదీతో నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం ముగిసింది. అంతకు ముందు మూడు, నాలుగు రోజులు నగరంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్స వాలతో అటు ప్రజాప్రతి నిధులు, ఇటు అధికారులు హడావుడి చేశారు. ఇక ప్రజలకు వీటి ఫలాలు అందుతాయని, అభివృద్ధి తమ నినాదమని, ఎన్నికల వరకే రాజకీయాలని, కలిసికట్టుగా కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని అధికారుల సాక్షిగా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. దీంతో ఇక కరీంనగర్ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుం దని,పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తవుతాయని నగరవాసులు ఆశించారు.

అన్ని డివిజన్లలో అదే పరిస్థితి

నగరంలోని అనేక డివిజన్లలో పార్కులు, ఓపెన్ జిమ్‌లను లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేయడమేకానీ వాటి నిర్వహణ బాధ్యతను ఎవరికీ అప్పగించక పోవడంతో అనుకున్న ఫలాలు ప్రజలకు అందడం లేదు. ఓపెన్ జిమ్‌ల పరికరాలు, క్రీడాపరికరాలు విరిగి పోవడం, పార్కులో చెట్లు, పచ్చిక బయళ్ళు ఎండిపోయి కళ తప్పుతున్నాయి.

కళ తప్పిన జంక్షన్లు

నగరంలోని ప్రధాన జంక్షన్ల సుందరీకరణకు కోట్ల రూపాయలను ఖర్చుచేశారు. వీటిలో అక్రమాలు, అవినీతి జరిగాయని, విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులతోపాటు అనేక ఆరోపణలు కూడా వచ్చాయి. ఆరోపణలు అలా ఉంటే వాటి నిర్వహణ చూసేవారు లేక జంక్షన్లు కళ తప్పిపోతున్నాయి. తెలంగాణ చౌక్‌లో దాదాపు కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన ఇందిరా జంక్షన్‌ను ప్రారంభించిన మొదట్లో ఆకర్షణీయమైన రంగురంగుల విద్యుద్దీపాలు, వాటర్‌ఫౌంటెన్లను చూసి ముచ్చపడుతూ సెల్ఫీలు దిగేందుకు ప్రజలు పోటీపడ్డారు. ఇది కూడా మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలింది. ప్రస్తుతం ఈ జంక్షన్‌లో లైటింగ్, వాటర్ ఫౌంటెన్లు పని చేయడం లేదు. లక్షల రూపాయలతో ఇందిరాగాంధీ విగ్రహంపై ఏర్పాటు చేసిన ఫ్రేమ్ కూడా తుప్పుపట్టే పరిస్థితికి చేరుకుంది., గ్రీనరీ, చెట్లు మచ్చుకు కూడా కనిపించడం లేదు.. అంబేద్కర్ చౌక్ (జంక్షన్) మినహా మిగిలిన దాదాపు అన్ని జంక్షన్ల పరిస్థితి ఇదే పరిస్థితి.

ఆక్రమణలకు గురవుతున్న ఫుట్‌పాత్‌లు

ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణలకు గురికాగా, చాలా చోట్ల రెయిలింగ్స్, టైల్స్ ఇప్పటికే దెబ్బతిన్నాయి. లక్షల రూపాయలతో చేపటిన పనుల నిర్వహణను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని నగర ప్రజలు విమర్శిస్తున్నారు. నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఈ విషయంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పూర్తికాని మల్టీపర్పస్ పార్క్ పనులు



అత్యాధునిక హంగులతో 12.35 కోట్ల రూపాయలతో చేపట్టిన మల్టీపర్పస్ పార్కులో ఇంకా కొన్ని సివిల్ పనులు కాలేదు. కాంట్రాక్టర్‌కు బాధ్యతను అప్పగించకపోవడంతో పార్కులోకి సందర్శకులను అనుమతించలేదు. పార్కును ప్రారంభించి 15 రోజులు దాటుతున్నా పనులు పూర్తికాక పోవడంతో ప్రజలకు అందుబాటులోకి రాలేదు. పనులు పూర్తి చేసి ప్రజలను అనుమతించేదెప్పుడని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణచౌక్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే పార్కును ప్రారంభించిన కొద్దిరోజులకే వాటర్ ఫౌంటేన్లను నిలిపి వేశారు. పార్కు నిర్వహణపై శ్రద్ధచూపక పోవడంతో రూపురేఖలు మారాయి. ప్రజల నుంచి విమర్శలు రావడంతో ఇటీవల ప్రైవేట్ వ్యక్తులకు పార్కు నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. కోటి 10 లక్షల రూపాయలతో సప్తగిరికాలనీలో ఏర్పాటు చేసిన రాజీవ్‌పార్కును గతనెల 23న ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు నిర్వహణ బాధ్యతను చూసేందుకు ఒక్క కార్మికుడినికానీ, వాచ్‌మెన్‌ను కానీ నియమించలేదు. పార్కు కమిటీ సభ్యులే ఆ బాధ్యతను చేపడుతున్నారు. పార్కులో ఏర్పాటు చేసిన గ్రంథాలయ గదిని వార్డు కార్యాలయంగా మార్చివేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

- వైభవంగా మహాపూర్ణాహుతి... వసంతోత్సవం.. చక్రస్నానం
- నేత్రపర్వంగా శ్రీపుష్పయాగం, సప్తావరణాలు, ధ్వజావరోహణ



ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం మహాపూర్ణాహుతి భక్తి భావాన్ని నింపగా, చూర్ణోత్సవ, వసంతోత్సవాలు, చక్రస్నానం వైభవంగా జరిపారు. సాయంత్రం నేత్రపర్వంగా శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, సప్తావరణాలు, ధ్వజావరోహణ, ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసభ్యులు, ఫిలిం ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పొన్నం రవిచంద్ర, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, జిల్లా గ్రంథాల య సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, వైద్యుల అంజన్‌కుమార్, కటకం వేంకటరమణ, ఆలయ వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో కందుల సుధాకర్ పాల్గొన్నారు. స్వామిని దర్శించుకునేందుకు మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత హాజరై పూజలు జరిపారు. ఆమెకు అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు.



ఉత్సవమూర్తులకు చక్రస్నానం

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్...

మధ్యాహ్న సమయంలో మంత్రి గంగుల కమలాకర్ ఆలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం చక్రస్నానం జరిగిన నీళ్ళను ప్రోక్షించుకున్నారు.

నేడు శ్రీవారి శోభాయాత్ర...

సోమవారం సాయంత్రం 6 గంటలకు మార్క్‌ఫెడ్ గ్రౌండ్ నుంచి శ్రీవారి శోభాయాత్ర ప్రారంభం కానుంది. దారి పొడవునా శ్రీవారి వాహన శ్రేణి మంత్రముగ్ధుల్ని చేయనుంది.

విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధులు, సభ్యులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సభ్యుడు తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వాలు విద్యారంగానికి అరకొర నిధులు కేటాయిస్తూ నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎం రఘుశంకర్‌రెడ్డి కేటాయింపులు తక్కువగా ఉండడం వల్లనే విద్యా నాణ్యత గ్రేడింగ్ ఇండెక్స్‌లో రాష్ట్రం 35వ స్థానానికి తెలంగాణ దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో కనీస మౌలిక వసతులు లేవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు కేవలం 7.3 శాతం నిధులు కేటాయించిందని, అవికూడా పూర్తిగా ఖర్చుచేయడం లేదని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి పనులు కూడా పూర్తిచేయలేదని, మధ్యాహ్నభోజనం నాణ్యంగా ఉండడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వచ్చే బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలని, కేజీ టు పీజీ వరకు గల ఉపాధ్యాయ, అధ్యాపకుల, బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బాధ్యులు పి ఈశ్వర్‌రెడ్డి, కె నారాయణరెడ్డి, కోహెడ చంద్రమౌళి, డి ఏసురెడ్డి, జానకీదేవి, నరహరి, రాంచంద్రారెడ్డి, తూముల తిరుపతి, వి బాలయ్య, కోల రాజమల్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్
- విద్యార్థులకు ఆలూ కుర్మా, పాయసం వండిన అడిషనల్ కలెక్టర్



విద్యార్థుల కోసం వంట చేస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ముకరంపురలో గల సమీకృత సంక్షేమ బాలుర గృహ సముదాయంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి ఆదివారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల కోసం స్వయంగా ఆలూ కుర్మా, పాయసం తయారు చేసి వడ్డించారు. వారితో కలిసి భోజనం చేశారు. విద్యాబోధనపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. సంక్షేమ వసతి గృహాల అధికారులు నెలకు ఒకసారి హాస్టల్, రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించాలని సూచించారు. తనిఖీలు చేయడం వల్ల పిల్లలకు మనోధైర్యం పెరుగుతుందని, వారికి సౌకర్యాలు అవసరమో తెలుస్తుందని అన్నారు. నూతన మెనూ ప్రకారం భోజనం తయారు చేసేందుకు నాణ్యమైన వస్తువులను వినియోగించుకోవాలని సూచించారు. బాలుర గృహంలో కేర్‌టేకర్లు భోజనం వండుతున్నప్పుడు, విద్యార్థులు భోజనం చేసే సమయంలో కిచెన్ షెడ్, డైనింగ్ హాల్‌లో ఉండాలని సూచించారు. వంట సిబ్బంది శుభ్రంగా ఉండాలని సూచించారు. డైనింగ్ హాల్, కిచెన్ షెడ్‌ను శుభ్రంగా ఉంచాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం బాలుర వసతిగృహంలో విద్యార్థులతో కలిసి హాస్టల్లోనే నిద్రించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఈడీ నాగార్జున, జిల్లా యూత్ కోఆర్డినేటర్ రాంబాబు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ నామినేషన్లు

- రేపు పరిశీలన, 13న ఉపసంహరణ
- 27న పోలింగ్... మార్చి 3న ఓట్ల లెక్కింపు
- భారీ ర్యాలీలకు అభ్యర్థుల సన్నాహాలు

7

మానసాదేవి ఆలయానికి వెళ్లేదెలా?

- బస్సులు లేక భక్తుల ఇబ్బందులు

గన్నేరువరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి, అపురూప లక్ష్మి అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులు ఆర్టీసీ బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారు. మొక్కుబడిగా ఏర్పాటు చేసిన ఒకటి రెండు బస్సులు జనాలతో కిక్కిరిసిపోతున్నాయి. 50 మంది ఎక్కాల్సిన బస్సుల్లో 150 మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. బస్సులు లేక ఆలయానికి వచ్చిన ప్రయాణికులు గంటల తరబడి ఆలయం వద్ద, కరీంనగర్ బస్టాండ్ వద్ద పడిగాపులు గాస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయకమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, కరీంనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. ఒక్క అదనపు బస్సును కూడా ఏర్పాటు చేయలేదు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఆలయానికి బస్సులు నడిపించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



బస్సు వద్ద భక్తుల రద్దీ



ఖాసింపేట మానసాదేవి ఆలయం వద్ద బస్సు ఎక్కేందుకు భక్తుల ఇబ్బందులు

కంది రైతులకు లభించని మద్దతు

- జాడలేని కొనుగోలు కేంద్రం
- తక్కువ ధరకు ప్రైవేట్ కొనుగోళ్లు



చొప్పదండి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు కరువైంది. పప్పు దినుసుల సాగు చేపట్టాలని ప్రభుత్వం ఓవైపు ప్రోత్సహి స్తూనే కొనుగోళ్లను మాత్రం మరిచింది. గత ఏడాది దిగుబడితోపాటు మంచి ధర రావడంతో రైతులు తిరిగి ఈసారి అధిక విస్తీర్ణంలో కంది సాగును చేపట్టారు. ఈ యేడు ధరతోపాటు దిగుబడి కూడా తగ్గింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేక రైతులు ప్రైవేట్ వ్యాపారులకు కందులను తక్కువ ధరలకే అమ్ముకుని నష్ట పోతున్నారు.

కేంద్ర ప్రభుత్వం కందులకు క్వింటాలుకు 7750 రూపాయలను మద్దతు ధరగా ప్రకటించింది. రైతులు కంది పంటను విస్తృతంగా సాగు చేశారు. పత్తి, మొక్కజొన్న పంటలో అంతర పంటగా కందిని రైతులు సాగు చేశారు. కొన్నిచోట్ల పూర్తిగా కంది సాగునే చేపట్టారు. పది రోజుల నుంచి కంది పంట కోతలు ప్రారంభం కాగా కందులను చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు కందులను ప్రైవేటు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. క్వింటాలుకు ఆరు వేల నుంచి 6,500 రూపాయలను మాత్రమే వ్యాపారులు చెల్లిస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేసేదేమీ లేక తమ పంటను రైతులు ప్రైవేట్ వ్యాపారులకే తక్కువ దరలకే విక్రయిస్తున్నారు.



చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో కందులు

అమ్మకానికి ఇబ్బందులు

గతంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని గంగాధరలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశా రు. మూడేళ్లుగా కందులకు బహిరంగ మార్కెట్లో మంచి ధరలు పలుకుతుండతో మార్క్‌ఫెడ్ కొనుగోళ్లను నిలిపివేసింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేకపోవడంతో వ్యాపారులు తక్కువ ధరకే కందులను కొనుగోలు చేస్తున్నారు. రైతులు ప్రతి క్వింటాల్ కందులకు దాదాపు వెయ్యి రూపా యలను కోల్పోతున్నారు .దీనికి తోడు ప్రైవేట్ వ్యాపారుల వద్ద కమిషన్, ఇతర ఖర్చుల రూపంలో మరికొన్ని డబ్బులను రైతులు కోల్పోతున్నారు. చొప్పదండిలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. వారం రోజులుగా చొప్ప దండి వ్యవ సాయ మార్కెట్‌కు కందుల విక్రయానికి రైతులు తీసుకువస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 400 క్వింటాళ్లను రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ము కున్నారు. మరో రెండు నెలల పాటు కందుల సీజన్ కొనసాగే అవకాశం ఉండగా 200 టన్నుల వరకు కందులు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. చొప్ప దండితో పాటు పొరుగు మండలాలైన జూలపల్లి, ఏలిగేడు, రామడుగు, ధర్మారం, మండలాల నుంచి రైతులు చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌కు కందులను తీసుకొస్తున్నారు. చొప్పదండిలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ప్రారంభించాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

తక్కువ ధరకే అమ్ముకుంటున్నాం

- తొట్ల తిరుపతి, రైతు పెద్దకుర్మపల్లి.



కందుల కొనుగోలు కేంద్రం లేక చాలా నష్టం వస్తుంది. వ్యాపారులు తక్కువ ధరకే కొంటున్నారు. పంటకు పెట్టుబడి పెరిగిపోయింది. ప్రభుత్వం వెంటనే కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులను ఆదుకోవాలి.

నేటి నుంచి 'పది' విద్యార్థులకు ఇంటర్నల్ పరీక్షలు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల విధానంలో రాష్ట్ర విద్యాశాఖ మార్పులు తీసుకువచ్చింది. ఇప్పటి వరకు ఉన్న గ్రేడ్ పాయింట్ యావరేజ్ విధానాన్ని రద్దు చేసింది. కొత్తగా ఈ యేడాది నుంచి 80 మార్కులకు రాతపరీక్ష, 20 మార్కులకు ఇంటర్నల్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. సోమవారం నుంచి ఇంటర్నల్ పరీక్షలను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈనెల 28వ తేదీ వరకు ఇంటర్నల్ పరీక్షలు నిర్వహించి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. దీంతో ఇకపై ఒక్క మార్కు కూడా ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంది.

ఇంటర్నల్ మార్కుల విధానంపై తల్లిదండ్రులు, విద్యార్థుల్లో భిన్నాభిప్రా యాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటర్నల్ విధానంతో పాటు ఈసారి విద్యార్థుల్లో పరీక్షల భయాందోళనలు తొలగించేందుకు అవగాహన సదస్సులను నిర్వహించి, పూర్తిస్థాయిలో సన్నద్ధం చేశారు.

అంతర్జాతీయ కరాటే పోటీలో బంగారు పతకం

గంగాధర, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. ఈ నెలలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఇంటర్ నేషనల్ ఓపెన్ కరాటే పోటీలను నిర్వహించారు. పాఠశాల నుంచి లగిషెట్టి శరణ్య పాల్గొని అండర్ 14 విభాగం స్పారింగ్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి బంగారు పతకం, 40 కిలోల విభాగంలో కటాస్‌లో ద్వితీయ స్థానం పొందినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి అంతర్జాతీయ కరాటే క్రీడల్లో పాఠశాల కీర్తిని చాటి బహుమతులు పొందిన శరణ్యను సన్మానించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బంగారు పతకం సాధించిన విద్యార్థిని శరణ్య

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన చర్యలు చేపట్టారు.


స్వామి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ప్రైవేటు డిగ్రీ కళాశాలలో షార్ట్‌సర్క్యూట్

- కాలిపోయిన కంప్యూటర్లు, ఫర్నీచర్


కాలిపోయిన పరికరాలను పరిశీలిస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి కంప్యూటర్లు, ఫర్నిచర్ కాలిపోయాయి. కళాశాలలో నుంచి మంటలు రావడాన్ని గమనించిన వాచ్‌మెన్ అప్రమత్తమై నిర్వాహకులకు సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న వారు అగ్నిమాపక సిబ్బందికి విషయం చేరవేశారు. హుటాహుటిన చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఘటనలో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని నిర్వాహకులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి చేరుకుని ప్రమాదం తీరును అడిగి తెలుసుకున్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్ రంగాపూర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. బసంత్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతిచెందిన మహిళకు సుమారు 32-35 మధ్య వయసు ఉంటుందని, మృతురాలు మతిస్థిమితం లేని స్థితిలో ఉందన్నారు. శనివారం రాత్రి ప్రమాదం జరగగా మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ స్వామి తెలిపారు. సంఘటనపై ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

గంగాధర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒద్యారం క్వారీలో పనిచేస్తున్న వలస కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ పటేల్(25) కొద్దిరోజులుగా ఒద్యారం గ్రానైట్ క్వారీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పది రోజుల నుంచి పనిచేయడం ఇష్టలేక తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు తెలిపినా వారు పనిలోనే ఉండాలని సూచించారు. పని చేయడం ఇష్టంలేక తల్లిదండ్రులు ఇంటికి రావద్దన్న మాటలకు మనస్తాపంతో గ్రానైట్ క్వారీ సమీపంలో ఆదివారం చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కన్యలాల్ పటేల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అజయ్(ఫైల్)

ధర్మారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని ఖానంపల్లి గ్రామానికి చెందిన గడ్డం అజయ్ (22) ఓ అమ్మాయిని ప్రేమించగా ఆమె పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో మనస్తాపానికి లోనై అజయ్ గతనెల 29న పురుగుల మందు తాగాడు. చికిత్సనిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆదివారం మరణించాడు. అజయ్ తండ్రి గడ్డం ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారం వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఏపీ-20 వై 7659 ఆటో ట్రాలీలో 20సంచుల్లో తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న డ్రైవర్ కర్రు సమ్మయ్యను విచారించగా బిట్టుపల్లి గ్రామానికి చెందిన కాసు రాజు, ఓదెలు చెప్పిన విధంగా బియ్యాన్ని మహారాష్ట్రలోని సిరోంచకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో గంజాయి విక్రయిస్తున్న శాస్త్రినగర్‌కు చెందిన వేముల శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వేముల శ్రీనివాస్ గోదావరిఖనిలోని ఓ హోటల్లో పని చేస్తున్నాడు. అతని చిన్న కుమారుడు చంద్రప్రకాష్ మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో పని చేస్తున్నాడు. అతని ద్వారా గంజాయి సుల్తానాబాద్‌లోని శ్రీనివాస్ ఇంటికి చేరవేస్తున్నాడు. దానిని శ్రీనివాస్ ఈ ప్రాంతంలోని వలస కూలీలకు, యువతకు చిన్న చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నాడు. పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా శ్రీనివాస్ గంజాయితో పట్టుబడ్డాడు. గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని మెడికల్ షాపులో దొంగతనానికి పాల్పడ్డ దొంగను పోలీసులు పట్టుకున్నారు. శాస్త్రినగర్‌కు చెందిన వేముల భవాని ప్రకాష్ అలియాస్ బబ్లూ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం శివశంకర్ మెడికల్ స్టోర్ షటర్ కు వేసి ఉన్న తాళాన్ని పగులకొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.24 నగదు, సెల్ ఫోన్‌ను చోరీ చేశాడన్నారు. నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి రూ.18 వేల నగదు సెల్ ఫోన్ రికవరీ చేశామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు.


బీర్‌పూర్ గ్రామం

బీర్‌పూర్‌లో అలజడి

- వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో.. మావోయిస్టు అగ్రనేత గణపతి స్వగ్రామంలో ఆందోళన
- ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని గుబులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో జరుగుతున్న వరస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ముప్పాల లక్ష్మణ్‌రావ్ అలియాస్ గణపతి స్వగ్రామం బీర్‌పూర్‌లో అలజడి నెలకొంది. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుం దోనని జగిత్యాల జిల్లా బీర్‌పూర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన బల్మూరి నారాయణరావ్ అలి యాస్ క్యాడర్ ప్రభాకర్ 2024 డిసెంబరు 23న అరెస్టు అయ్యాడు. 2025 జనవరి 21న ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో గరియాబంద్ జిల్లా కుల్హాడీఘాట్ అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్ రెడ్డి అలి యాస్ చలపతి అలియాస్ జయరాం(62)తో పాటు ఒడిశాలో మావోయిస్టు పార్టీ కీలకనేత మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ(ఎస్‌జడ్‌సీ) సభ్యుడు గుడూలతో పాటు మరికొంతమంది మావోయిస్టులు మృతి చెందారు.ఈ వార్త తెలిసిన గ్రామస్థులు గణపతి ఎలా ఉన్నాడో, ఎక్కడ ఉన్నాడో అని నిత్యం చర్చించుకుంటున్నారు.

• ఉపాధ్యాయ వృత్తి నుంచి ఉద్యమం వైపు..

మావోయిస్టు అగ్రనేత ముప్పాల లక్ష్మణ్‌రావ్ అలియాస్ గణపతి జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో ముప్పాల గోపాల్‌రావ్-శేషమ్మ దంపతులకు 1949వ సంవత్సరం జూన్16న నాలుగో సంతానంగా జన్మించాడు. గణపతి అన్నయ్య నర్సింగారావ్ హైదరాబాద్‌లో ఉండగా తమ్ముడు రాంచందర్‌రావ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ మృతి చెందాడు. గణపతికి ఇద్దరు అక్కలు ఉన్నారు. గణపతికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాగినేడుకు చెందిన విజయతో వివాహం జరగ్గా కుమారుడు శ్రీనివాసరావ్ ఉన్నాడు. గణపతి విదేశాలకు వెళ్లి వచ్చి ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తున్నాడని తెలిసింది. గణపతి మూడో తరగతి వరకు బీర్‌పూర్‌లో చదివిన అనంతరం కరీంనగర్ జిల్లాలోని అమ్మమ్మ గ్రామమైన గంగిపెల్లిలో 7వ తరగతి వరకు చదివాడు. జగిత్యాలలో 7వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యను అభ్యసించాడు. కరీంనగర్‌లోని రాజరాజేశ్వర కాలేజీలో బీఎస్సీ పూర్తి చేశాడు. 1970లో ప్రభుత్వ ఉపాధ్యా యుడిగా ఉద్యోగం సంపాదించి కరీంనగర్ జిల్లా లోని ఎలగందులలో మొదట పోస్టులో చేరారు. ఆ తరువాత ఎలిగేడులో కొంతకాలం పనిచేశాడు. అనంతరం రుద్రంగికి బదిలీపై వెళ్లిన ఆయనను బీఈడీ ట్రైనింగ్ నిమిత్తం వరంగల్ జిల్లాకు పంపగా పంపగా అక్కడ మావోయిస్టు నాయకులు నల్లా ఆదిరెడ్డి మరియు కొండపల్లి సీతారామయ్యలతో పరిచయం ఏర్పడింది. చివరికి వారి భావాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరాలని నిర్ణయించుకున్నాడు. అతడు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్) పీపుల్స్ వార్ గ్రూప్ యొక్క ప్రారంభ సభ్యులలో ఒకడు. ఇప్పుడు విలీనమైన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) అని పిలువబడే పార్టీకి కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి స్థాయికి గణపతి అంచెలంచెలుగా ఎదిగాడు. గణపతి లొంగిపోవాలని 2013లో బీర్‌పూర్‌లో అప్పటి ఎస్పీ శివకుమార్ ఆధ్వర్యంలో అంతర్మథనం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామంలో బస చేశారు.

చిన్నప్పుడు ఎవరినీ ఏమీ అనేవాడు కాదు

-బింగి నర్సయ్య, బీర్‌పూర్



చిన్నపుడు మేము చదువుకునే సమయంలో లక్ష్మణ్‌రావ్ అందరితో మంచిగానే ఉండేవాడు. ఎవరితో కొట్లాడేవాడు కాదు. మాతో పాటు హన్మండ్ల గుడి వద్ద ఉన్న బడిలో చదువుకున్నాడు. లక్ష్మణ్‌రావ్ నాకంటే ఒక్క తరగతి పెద్ద. అందరం కలిసి ఆడుకునే వాళ్లం.

• బీర్‌పూర్‌లో పోటాపోటీ స్తూపాలు

పోలీసుల చేతుల్లో మావోయిస్టులు మృతిచెందారని అప్పట్లో మావోయిస్టు దళాలు జగిత్యాలకు వెళ్లే బస్టాండ్ వద్ద ఎర్ర స్తూపాన్ని నిర్మించారు. మావోయిస్టుల చేతిలో అమరులైన 43 మంది పేరు మీద పోలీసులు ధర్మపురి వెళ్లే బస్టాండ్ వద్ద శాంతిస్తూపాన్ని నిర్మించారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలో 22 గ్రామాలు ఉండేవి. 11గ్రామాలతో గణపతి స్వగ్రామాన్ని బీర్‌పూర్ మండల కేంద్రంగా ప్రకటించారు. ప్రస్తుతానికి బీర్‌పూర్ గ్రామంలో మావోయిస్టు ప్రభావం పూర్తిగా తగ్గిపోవడంతో యువకులు ఆర్మీ, ఇండియన్ నేవీ, సివిల్ పోలీస్ కొలువులు సాధిస్తున్నారు. గ్రామంలో సుమారు 15 మంది వరకు పోలీస్ శాఖలో ఉద్యోగాలు చేస్తున్నారు.


పోలీసులు నిర్మించిన శాంతిస్తూపం

పారుతున్న బిక్కవాగు.. రైతుల్లో ఆనందం

- యాసంగి పంటలకు ఇబ్బంది ఉండదంటున్న రైతులు - నాలుగు వేల ఎకరాలకు ప్రయోజనం


ఇల్లంతకుంటలో ప్రవహిస్తున్న బిక్కవాగు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అనంతారం ప్రాజెక్టు దిగువన ఉన్న బిక్కవాగు ప్రవహిస్తుండటంతో యాసంగి పంటలకు ఇబ్బంది తొలగిపోయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.93 టీఎంసీల నీరు ఉంది. దీంతో స్థానిక రైతుల వినతుల మేరకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో మాట్లాడి అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయించారు.

ప్రాజెక్టు నిండి మత్తడి దూకడంతో దిగువన ఉన్న బిక్కవాగు పారుతోంది. ఓవైపు ఫీడర్ ఛానల్ ద్వారా రహీంఖాన్‌పేట గ్రామంలోని సింగరాయకుంటకు నీరు చేరుతూ, మరోవైపు దిగువ ప్రాంతానికి నీరు వస్తోంది. జంగమరెడ్డిపల్లె, అనంతారం, ఇల్లంతకుంట, వంతడుపుల, నర్సక్కపేట, జవారిపేట గ్రామాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుంది. బిక్కవాగు సమీపంలోని రైతులందరు వరిపంటను సాగుచేశారు. వరిలో కలుపు తీసి రెండవసారి ఎరువులు చల్లుతున్నారు. ప్రస్తుత దశలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి సమయంలో బిక్కవాగు పారుతుండటం వల్ల ఇబ్బందులు తొలగినట్లేనని, అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను మరింత పెంచితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

● యాసంగి పంటకు ఇబ్బంది తొలగిపోతుంది..

- దయ్యాల కనుకయ్య, రైతు ఇల్లంతకుంట



బిక్కవాగు పారుతుండటంతో యాసంగి పంటకు ఎదురయ్యే ఇబ్బంది తొలగిపోతుంది. వరిచేను కలుపుతీయడం వల్ల నీరు ఎక్కువగా తాగుతుంది. ఎండల వల్ల బావులు, బోర్లలో నీరు రోజురోజుకు తగ్గుతోంది. పదిహేను రోజుల పాటు వాగుపారితే రైతులకు ఉపయోగం ఉంటుంది. బిక్కవాగు పారితే ఎనిమిది గ్రామాల రైతులు లాభపడతారు. బిక్కవాగులోని ముళ్లపొదలను తొలగించి, వ్యర్థాలను వేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

● నీటి విడుదలతో ప్రయోజనం..

- పారిపెల్లి మధుసూదన్‌రెడ్డి, రైతు జంగమరెడ్డిపల్లె



అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి అనంతారం ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ప్రాజెక్టు దిగువన ఉన్న బిక్కవాగు పారుతుండటం భూగర్భ జలాలు పెరుగుతాయి. రైతుల పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ నీటిని విడుదల చేయించడం సంతోషకరం. ఎక్కువ మొత్తంలో నీటి విడుదల చేసినట్లయితే మరింత ప్రయోజనం కలుగుతుంది.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్

ఐదు ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం -వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో వరుసగా చోరీలకు పాల్పడుతున్న ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను ఆదివారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు త రలించారు. జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాల ను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన జక్కుల గోపాల్, సింగంరాజు, నేరెళ్ల నరేష్, సంపతి కుమారస్వామి, బుర్రరాజేందర్ జల్సాలకు అలవాటు పడి ఒక ముఠాగా ఏర్పడ్డారు. జక్కుల గోపాల్‌కు చెందిన ఓ కారులో రాత్రి సమయాల్లో తిరుగుతూ ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామంలో గత డిసెంబరులో బైక్ దొంగిలించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామంలో మరో బైక్‌ను, చిన్నబెల్లాల్ గ్రామంలోని ఇంటి ముందు పార్కు చేసిన మరో బైక్‌ను, జగిత్యాల మండ లం తిప్పన్నపేట, దండేపల్లి మండలంలోని ద్వారకానగర్‌లో ఇంటిముందర పార్కు చేసిన రెండు బైక్‌లను దొంగతనానికి పాల్పడ్డారు. దొంగిలించిన బైక్‌లను తమ ఇంటి వద్ద దాచి పెట్టినట్లు నిందితులు ఒప్పుకున్నారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు పెద్దిరాజం బైక్ అపహరించడంతో జగిత్యాల రూరల్‌స్టేషన్‌లో బాధితుడు జనవరిలో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసు లు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా ఆదివారం తిప్పన్నపేట గ్రామ శివారులో కారులో వస్తున్న ఐదుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు పట్టుబడ్డారు. నిందితులను పట్టుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్, కానిస్టేబుల్‌లు శ్రీనివాస్, గంగాధర్, రాహుల్, ఉమర్, మోహన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

కడుపు నొప్పి భరించలేక వృద్ధుడి ఆత్మహత్య


అమరగొండ వీరయ్య(ఫైల్)

సైదాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మం డలంలోని వెన్కేపల్లి గ్రామానికి చెందిన అమరగొండ వీరయ్య (75) అనే వృద్ధుడు కడుపునొప్పి భరించలేక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వీరయ్య-రాజమ్మ దంపతులు ఓ ఇంటిలో ఉంటున్నారు. శనివారం రాజమ్మ ఐనవోలు జాతరకు వెళ్లడంతో ఇంట్లో వీరయ్య ఒక్కడే ఉన్నాడు. వీరయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం సాయంత్రం పెద్ద కుమారుడు అమరగొండ రాజయ్య కథ చెప్పేందుకు వేరే ఊరికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం సుమారు 9 గంటల ప్రాంతంలో చిన్న కుమారుడు మల్లేష్ తన తండ్రి వీరయ్య వద్దకు వెళ్లి అతడు భోజనం చేసే వరకు ఉండి తన ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం అమరగొండ మల్లేష్ పాలు ఇచ్చేందుకు తనతండ్రి వద్దకు వచ్చి ఇంట్లో చూడగా తన తండ్రి కనిపించలేదు. దాంతో చుట్టుపక్కల వాళ్లను అడుగగా తెలియదని చెప్పారు. చుట్టుపక్కల, బావులలో వెతుకగా అమర గొండ కొమురయ్య చేదబావిలో శవమై కనిపించినట్లు తెలిపారు. తన తండ్రి అమరగొండ వీరయ్యకు కొంతకాలంగా కడుపు నొప్పి ఉన్నదని, ఈ మధ్యనే ఆస్పత్రిలో చూపించగా ఆపరేషన్ చేయాలని డాక్టర్ చెప్పాడని మృతుడి చిన్న కుమారుడు మల్లేష్ తెలిపాడు. కడుపు నొప్పి భరించలేక రాత్రి ఎవరు లేని సమయంలో బావిలో దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని మృతుడి చిన్న కుమారుడు అమరగొండ మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

మామ లైంగికంగా వేధిస్తున్నాడని కోడలు నిరసన

- తల్లిదండ్రులు, కొడుకుతో కలిసి బైఠాయింపు

మంథని, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోడలును కన్న కూతురిలా చూసుకోవాల్సిన మామ లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని పెద్దపల్లి జిల్లా మంథని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం కోడలు నిరసన వ్యక్తం చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన యువతికి నాలుగేళ్ల క్రితం పోచమ్మవాడకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉండగా ప్రస్తుతం యువతి ఏడు నెలల గర్భవతి. కాగా మామ తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని, భర్త సైతం తండ్రి చెప్పినట్లు సహకరించాలంటున్నాడని ఆరోపణలు చేసింది. అదనపు కట్నం కోసం మామ, అత్త, భర్త వేధింపులకు గురి చేయడంతోపాటు గత నెల 12న ఇంట్లో నుంచి గెట్టివేయగా మంథని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పోలీసు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. స్టేషన్‌లో ఫిర్యాదు తర్వాత తాను ఖమ్మంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లినట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం భర్త తన సెల్‌ఫోన్‌కు ఓ అమ్మాయి ఫొటోను పంపి ఆమెను పెండ్లి చేసుకుంటున్నానని, నీతో, నీకు పుట్టిన పిల్లలతో నాకు సంబంధం లేదని చెప్పినట్లు పేర్కొంది. దీంతో ఆదివారం మంథనికి వచ్చిన యువతి తల్లిదండ్రులు, కొడుకుతో కలిసి బైఠాయించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను, కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా గత నెల 12న అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారన్నారు. ఆమె ఖమ్మంకు వెళ్లడంతో కౌన్సెలింగ్ పిలిచినా రాలేదని పేర్కొన్నారు. మామ, భర్త లైంగిక వేధింపులపై ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్లు



చొప్పదండి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రహదారిపై ఎక్కడైనా ప్రమాదం జరగగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది 108 టోల్‌ఫ్రీ నంబర్. 108కు ఫోన్ చేయగానే అంబులెన్స్ వచ్చి ప్రమాద బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్తుంది, ఆపదలో సహాయపడుతుంది. ఇదే విధంగా పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు 100నంబర్‌కు డయల్‌చేసి ఫిర్యాదు చేస్తాం. ఇవన్నీ అత్యవసర సమయంలో మనకు గుర్తుకు వచ్చే నంబర్లు. ఇదే విధరంగా ఇతర అనేక రకాల సేవలకు వివిధ నంబర్లు ఉన్నాయి. అత్యవసరంలో టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయగానే సేవలు అందుబాటులోకి వస్తాయి, సమస్యలు పరిష్కారం అవుతాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సేవల కోసం ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ల వివరాలు మీ కోసం...

అగ్నిమాపక సేవల కోసం 101
అగ్నిప్రమాదాలు సంబవించినప్పుడు ఫైరింజన్ కోసం 101 నంబర్‌కు ఫోన్ చేస్తే ప్రమాద స్థలానికి ఫైరింజన్‌ను పంపిస్తారు.

సంచార వైద్యం కోసం 104
రైతు మంగిటే పశువుల వైద్యానికి 104 అంబులెన్స్ వాహనం సంచార వైద్యశాలగా ఉపయోగపడుతుంది.

రైల్వే సమస్యల కోసం 139
రైలులో ప్రయాణించేటప్పుడు, ఇతర సమస్యల కోసం 139 నంబర్‌కు ఫోన్ చేస్తే అధికారులు సమస్యలను పరిష్కరిస్తారు.

టెలికాం సేవల కోసం 198
దేశవ్యాప్తంగా మొబైల్ నెట్‌వర్కింగ్ సేవలో అంతరాయం ఏర్పడిన, వినియోగదారుల సమస్యలు, సందేహాలే తీర్చడానికి ఈ నంబర్ ఉపయోగపడుతుంది.

ఆపదలో ఉన్న మహిళల కోసం 1091
ఈ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఆపదలో ఉన్న, వేధింపులకు గురైన మహిళలు సహాయం పొందవచ్చు.

పిల్లలను వేధిస్తే, బాల కార్మికులను గుర్తిస్తే 1098
6 నుంచి 14సంవత్సరాల పిల్లలు వేధింపులకు గురైనా, బాలకార్మికులను గుర్తించినా 1098 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందిస్తే అధికారులు వారిని చేరదీస్తారు.

ఓటరు నమోదు, తదితర సమస్యల పరిష్కారానికి 1950
ఎన్నికలు, ఓటర్ల జాబితాలో వ్యక్తిగత సమాచారం, ఓటింగ్ తేదీలు, పోలింగ్‌స్టేషన్ వివరాలు తెలుసుకోవచ్చు. ఫిర్యాదుల పరిష్కారానికి కాల్ చేయవచ్చు.

మీ సేవలో సమాచారం, సమస్యల పరిష్కారం 1100
ఈ టోల్ ఫ్రీ నంబర్‌ను మీసేవా కాల్ సెంటర్‌గా ఉపయోగిస్తారు. రాష్ట్రంలోని ప్రజలు ఫిర్యాదులు, సూచనల కోసం ఈ నంబర్‌ను ఉపయోగించవచ్చు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912
విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ఇతర సమస్యలు ఎదురైతే ఈ నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు.

వినియోగదారుల సేవల కోసం జాతీయ హెల్ప్‌లైన్ 1915
వినియోగదారులు ఏదైనా ఉత్పత్తి, సేవపై సులభంగా ఫిర్యాదు చేయడానికి, ఫిర్యాదులను ట్రాక్ చేయడానికి ఈ టోల్ ఫ్రీ నంబర్ వీలు కల్పిసుంది.

వ్యవసాయ సమాచారం, సమస్యలపై కిసాన్ కాల్ సెంటర్ 1800-1801551
వ్యవసాయంలో సలహాలు, సూచనలు కోసం రైతులు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. వాతావరణ వివరాలను సైతం తెలుసుకోవచ్చు.

మహిళల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ 181
గృహహింస వరకట్న వేధింపులు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు వంటి పరిస్థితుల్లో ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. మహిళలు అందుబాటులో ఉన్న సహాయ సేవలు, ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి తెలుసుకోవచ్చు.

ఉపాధి హామీ పనులలో సమస్యలు పరిష్కారం కోసం 1800-2001001
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సమస్యలు, వేతనాల కోసం కూలీలు ఈ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930
సైబర్ నేరగాళ్లకు అడ్డుగట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

టీఎస్‌ఆర్‌టీసీ సేవల కోసం 040-69440000
బస్సు ప్రయాణంతో పాటు ఇతర సమస్యలకు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులకు సమస్య చేరి దాని పరష్కారానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



కనుకులగిద్దె గ్రామంలో సాగు వివరాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువ రైతు

సోషల్ మీడియా సాయంతో వ్యవసాయం

- సామాజిక మాధ్యమాలను అనుసరిస్తున్న యువ రైతులు
- ఆధునిక పద్ధతుల్లో సాగుతో అధిక దిగుబడులు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా యువ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. గ్రామాల్లో యువ రైతులు సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతున్నారు. వ్యవసాయానికి సంబంధించి కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు. పంటల సాగులో కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఆధునిక పద్ధతులు ఏవి.. అధిక దిగుబడులు ఎలా సాధించాలి.. ఏ సీజీన్లలో ఏ కూరగాయాలు పండించాలి.. ఏ కాలంలో విత్తనాలు వేసుకోవాలి, పంట వివిధ దశల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలేంటి.. సాగులో యంత్రాల వినియోగం ఎలా..మార్కెట్లో వేటికి డిమాండ్ ఉంటుంది.. తదితర విషయాలను యూట్యూబ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని ఆచరణలో పెడుతున్నారు. అధిక దిగుబడులను సాధిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు.



జూపాక గ్రామంలో సాగు పనుల వివరాలను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్న యువ రైతు

● వీడియోలు, పోస్టుల ద్వారా కొత్త విషయాలు

వివిధ రాష్ట్రాల్లో రైతులు సాగు చేస్తున్న కూరగాయలు, ఇతర పంటలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను సామాజిక మాధ్యమాలైన యూట్యూబ్ వీడియోలు, ఫేస్‌బుక్‌లో పోస్టులు పెడుతున్నారు. వాటిని ఫాలో అవుతూ కొత్త విషయాలను రైతులు తెలుసుకుంటున్నారు. తమకు అవసరమైన సమాచారాన్ని వెతికి సేకరించుకుంటున్నారు. వాటిపై అవగాహన పెంచుకుని ఆచరణలో పెడుతున్నారు. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని తెలుసుకుంటున్నారు. కలుపు తీసే యంతాల్రు, క్రిమిసంహారక మందులు చల్లే డ్రోన్లు, పొలం దున్నేవి, పంటలు కోసే యంత్రాల గురించి తెలుసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన రైతుల వీడియోలను స్థానిక రైతులు చూస్తూ కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నారు.

సోషల్ మీడియా ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చు
-జొంగోని అనిల్, యువ రైతు, జూపాక



నేను చాలా కాలంగా సోషల్ మీడియా ఫాలో అవుతూ పంటల సాగులో కొత్త విషయాలను తెలుసుకుంటున్నాను. యూట్యూబ్‌లో వివిధ రకాల సాగు పనులు, మెళవకులు తెలుసుకుంటున్నాను. వాటిని అనుసరిస్తున్నాను. వ్యవసాయంలో స్మార్ట్‌ఫోన్ బాగా ఉపయోగపడుతోంది. పాడి గేదెల పెంపకం, అధిక పాల ఉత్పత్తికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన వీడియోలను చూసి ఆచరిస్తున్నాను.

మొదట్లో ఇబ్బంది పడ్డాను..
-బొల్లవేణి శ్రావణ్‌కుమార్, యువ రైతు, కందుగుల



వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తెలియక మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను. నేను అందరి లాగా పంటలను సాగు చేసేవాడిని. ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, వాట్సాప్ గ్రూప్‌లలో సాగుకు సంబంధించిన వీడియోల ద్వారా పలు విషయాలు తెలుసుకొని సాగు పనులు చేస్తున్నాను. నాకు తెలిసిన వారికి కూడా పంట సాగు వివరాలను తెలియజేస్తున్నా. కొత్త మెళకువలతో సాగు చేసిన రైతుల ఫోన్ నంబర్లు తీసుకొని వారితో మాట్లాడుతున్నాను. వారి సూచనలు, సలహాలతో పంటలు సాగు చేస్తూ దిగుబడి పొందుతున్నాను.

కొండగట్టు క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్సీ కవిత
- అంజన్న సన్నిధిలో పూజలు



కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మల్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామి క్షేత్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఆలయ అభివృద్ధికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపొందించి అమలుకు కృషి చేసిందన్నారు. ప్రభుత్వం మారినందన అభివృద్ధి ఆగిపోకుండా గత ప్రణాళిక అమలు చేయాలని లేకుంటే అంత కన్నా మెరుగైన ప్రణాళికతో కాంగ్రెస్ ప్రభుత్వం దేవస్థానం అభివృద్ధి చేయాలని ఆమె అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ కవిత కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొండగట్టుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తూంటారని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొండగట్టు అభివృద్ధికి మెట్లదారి, కోనేరు, షెడ్లు, దీక్ష విరమణ మండపం పనులు చేపట్టిందన్నారు. రూ.25 కోట్లతో వరదకాలువ నుంచి నీటిని తరలించి కొండపై శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిందని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను వచ్చే హనుమాన్ జయంతిలోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కొండగట్టు ఘాట్ రోడ్డు అభివృద్ధి పనులపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీలు రామ్మోహన్‌రావు, ప్రశాంతి, విండో చైర్మన్ సాగర్‌రావు, బద్దం తిరుపతిరెడ్డి, కొంక నర్సయ్య, కోటేశ్వర్‌రావు, సురేందర్ ఉన్నారు.

'కులగణనలో బీసీ జనాభా తగ్గడం పెద్ద కుట్ర'

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీ జనాభా తగ్గడం వెనక పెద్ద కుట్ర జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీసీ భనవంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పర్శహన్మాండ్లు మాట్లాడారు. బీసీ కులగణన బీసీలకు అమృతం అవుతుందని అనుకున్నామని కాని అసెంబ్లీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టిన కులగణన లెక్కలు, ఆయన మాట్లాడిన తీరును బట్టి చూస్తే బీసీ కులగణన అనేది బూడిదలో పోసిన పన్నీరు అయిందన్నారు. 2014లో బీసీల జనాభా 51 శాతం ఉంటే 2024 సంవత్సరంలో 46 శాతానికి తగ్గడం వెనకాల పెద్ద కుట్ర దాగి ఉందని అనుమానాలను వ్యక్తం చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- భారీగా తరలి వచ్చిన భక్తులు



కల్యాణానికి భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో బాగంగా ఆదివారం కల్యాణ వేడుకలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులను శావలో ఆలయం చుట్టు ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వేర్వేరు సమయాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

ఎస్సై కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కల్యాణ వేడుకల్లో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావు, కొల్వాయి సింగిల్‌విండో చైర్మన్ నవీన్‌రావ్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు పాత పద్మ రమేష్, ఆలయ మాజీ చైర్మన్‌లు ఎనగంటి సామ్రాట్, నేరెల్ల సుమన్‌గౌడ్, గోనె రమణ రావు , మాజీ జడ్పీటీసీ సభ్యులు ముప్పాల జలజ, కొల్మూల రమణ, ఆల య ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మదు కుమార్, చిన్న సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగంతో పాటు నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూరాబాద్ పట్టణంలో ఆత్మీయ సమ్మేళన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి 55వేల నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యూనివర్సిటీలకు తగిన నిధులిచ్చారన్నారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దన్నారు. సమావేశంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మహిళా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సత్యప్రసన్నరెడ్డి, కౌరు సుగుణాకర్‌రెడ్డి, శంకర్, బాబు, కిరణ్‌కుమార్, పుష్పలత, రాహుల్, రాజు, లావణ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్, రత్నం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్‌ను ఓట్లు అభ్యర్థించిన ఎమ్మెల్సీ అభ్యర్థులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ఆదివారం ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన పోరాడిన పార్టీ అభ్యర్థులను ఆదరించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇస్తే ఏమీ చేయలేదనే భావన ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఉందని, పట్టభద్రులు, విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలకోసం పోరాడింది బీజేపీ మాత్రమేనని అన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు చూపుతున్న ఆదరణ, విశ్వాసాన్ని మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తామన్నారు. మొదటి ప్రాధాన్య ఓటును బీజేపీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ వై సునీల్‌రావు, వైద రామాను, బండ రమణారెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే పోటీ

గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను సన్మానిస్తున్న పట్టభద్రులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం హుజూరాబాద్, జమ్మికుంటలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులకు అనేక సమస్యలు ఉన్నాయని, విద్యా వ్యాపారం చేసే వ్యక్తులకు వారి సమస్యలపై అవగాహన లేదన్నారు. విద్యా వ్యాపారాన్ని చేస్తున్న వ్యక్తి రాజకీయాల్లోకి వచ్చి పట్టభద్రుల గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. తనకు విద్యారంగ ప్రొఫెసర్‌గా పట్టభద్రుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. యువత, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తునన్నారు. హుజూరాబాద్, జమ్మికుంటలోని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ మద్దతు తెలపడం అభినందనీయమన్నారు.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ నామినేషన్లు

- రేపు పరిశీలన, 13న ఉపసంహరణ
- 27న పోలింగ్... మార్చి 3న ఓట్ల లెక్కింపు
- భారీ ర్యాలీలకు అభ్యర్థుల సన్నాహాలు

కరీంనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారం ముగియనున్నది. ఈ నెల 11న నామినేషన్లను పరిశీలించి అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ తీవ్రంగా ఉంది. ఓటర్ల నమోదు కార్యక్రమం నుంచే పోటాపోటీగా ఓటర్ల నమోదు చేయించుకోవడంతోపాటు ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా ఇప్పటి వరకు 58 మంది అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో 49 మంది పట్టభద్రుల స్థానానికి, తొమ్మిది మంది ఉపాధ్యాయ స్థానానికి నామినేషన్లను వేశారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగియనుండడంతో చివరి రోజున పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేస్తారని భావించిన అధికార యంత్రాంగం కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసింది. చివరిరోజు పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డితోపాటు మరికొందరు అభ్యర్థులు, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కూడా భారీ ర్యాలీలు నిర్వహించి నామినేషన్లను దాఖలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

ఘనంగా పారమిత ఎక్స్‌ప్లోరిక వార్షికోత్సవం



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పారమిత ఎక్స్‌ప్లోరిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో 'బిస్తువ' పేరుతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, నాటకాలు, శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు మాట్లాడుతూ బిస్తువ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు జీవితంలో ఆలోచనల మార్పుపై అవగాహన కలుగుతుందని, వారి భావోద్వేగాలను, సృజనాత్మకతను ప్రదర్శించడానికి మంచి వేదికగా దీన్ని అందించడం పాఠశాల ఉద్దేశమని అన్నారు. విద్యార్థుల్లో ధృడమైన ఆలోచనాశక్తి, సానుకూల దృక్పథం, వ్యక్తిత్వ అభివృద్ధి చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, ప్రాచి, అనుకర్, వినోద్‌రావు, రమణ, వియయం ప్రసాద్, హన్మంతరావు, హెచ్‌ఎం శర్మిష్ట పాల్గొన్నారు.

రచయిత వైరాగ్యం ప్రభాకర్‌కు సన్మానం



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ జిరసం బాధ్యులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా శంకరపురంలో ఆదివారం వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో సాహిత్య సాంస్కృతిక మహాసభల్లో జిల్లాకు చెందిన రచయిత, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, సంఘ గౌరవాధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గంగాధర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాలతోపాటు 7వ తరగతి నుంచి 10వతరగతిలో మిగులు సీట్లకు విద్యార్థులు ఫిబ్రవరి 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 13న ఉదయం ఆరో తరగతికి, మధ్యాహ్నం 7వ తరగతి నుంచి 10వ తరగతుల ప్రవేశాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి గెలుపునకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ మంద నగేష్ ముదిరాజ్ కోరారు. ఆదివారం కోర్టు చౌరస్తాలోని ఒక హోటల్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్లు, మాజీ ఎమ్మెల్యే, ఇతర ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సోమవారం జరిగే నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా స్వప్న

చొప్పదండి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా చిలుముల స్వప్నను నియమించారు. రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు నియామక పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి చెందిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు.

అందని వేతనాలు.. తీరని కష్టాలు

- పశు సంచార వాహన సిబ్బంది వెతలు
- నాలుగు నెలలుగా రాని జీతాలు



మానకొండూర్ పశు సంచార వాహన సిబ్బంది

మానకొండూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వేతనాలు అందక 1962 పశు సంచార వాహన సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు నాలుగు నెలలుగా జీతాలు రాక కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో మూగ జీవాలకు సేవలందిస్తున్న సిబ్బంది చాలీచాలనీ వేతనాలతో నెట్టుకొస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో నెలనెలా జీతాలు వస్తాయని ఆశలు పెట్టుకున్న సిబ్బందికి నిరాశే మిగిలింది. ఇటీవల నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. నియోజకవర్గానికి ఒక వాహనం చొప్పున సిబ్బంది మూగ జీవాలకు సేవలు అందిస్తున్నారు. 1962 పశు సంచార సేవల్లో పశు వైద్యులు, పారా మెడికల్ సహాయకులు, డ్రైవర్‌లు ఉన్నారు. నాలుగు నెలలుగా జీతాలు లేక ఆర్థిక భారంతో అవస్థలు పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో మూగజీవాలకు అందిస్తున్న సేవలపై రైతుల నుంచి అభినందనలు తప్ప ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందడం లేదు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు. లేకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వైద్యురాలు అనూష, ప్యారేట్ రోషిణి, కెప్టెన్ మతీన్, హెల్పర్ రాజేందర్ వాపోయారు.

నరేందర్‌రెడ్డి నామినేషన్‌కు మంత్రుల రాక

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి నాలుగు జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, మంత్రులు దామోదర్ రాజ నర్సింహా, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గ్రంథాలయ చైర్మన్, సుడా చైర్మన్ హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.

నేడు శ్రీరామ శాంతి కల్యాణం

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ఆదిత్యాది నవగ్రహ, అభయాంజనేయస్వామి శిఖర కలశ ప్రతిష్ఠాపన, శ్రీరామ శాంతి కల్యాణం, అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపూజ, విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధనం, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నరేందర్‌రెడ్డికి సీపీఐ మద్దతు



మద్దతు ప్రకటిస్తున్న సీపీఐ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని సీపీఐ జిల్లా కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల నియోజక వర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డికి రాష్ట్ర పార్టీ నిర్ణయించిన ప్రకారం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, ఈటి నర్సింహులు, జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాండ్ర సదానందం, వెన్న సురేష్, రామడుగు లక్ష్మణ్, ముడుపు ప్రభాకర్‌రెడ్డి, కర్రె భిక్షపతి, సుధాకర్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

వొడితెల ప్రణవ్‌ను కలిసిన నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ వివాహ దినోత్సవం సందర్భంగా మండలంలోని సింగాపూర్‌లో ఆదివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్ని కలో పార్టీ విజయానికి కృషి చేస్తానని ప్రణవ్ హామీ ఇచ్చారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామిని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, ఆలయ అర్చకులు నరేందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాడ రాజిరెడ్డి, కొండాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సాగర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బీసీల్లో ముస్లింలను చేర్చవద్దని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించడం సరికాదని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూ, ముస్లింలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే చరిత్ర బండి సంజయ్ దని అన్నారు. బీసీలకు ప్రభుత్వాలు రిజర్వేషన్లు పెంచితే తామెప్పుడు అడ్డుకోలేదన్నారు. బండి సంజయ్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగినా ప్రవర్తన మార్చుకోలేదన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. దేశంలో 30 శాతం ముస్లింలు ఉన్నారని, అందులో 90 శాతం పేదలేనని, వీరికి రిజర్వేషన్లు ఎందుకు కల్పించవద్దని ప్రశ్నించారు. రిజర్వేషన్లు వద్దు అనడానికి బండి సంజయ్ ఎవరని, భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని అడుగుతున్నామని అన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తే, దొంగ లెక్కలు చూపించి దానిని నాలుగు శాతం చేశారన్నారు. ముస్లింలకు 8 నుంచి 10 శాతం వరకు రిజర్వేషన్ కావాలన్నారు.నాయకులు షహెన్షా, కలిముద్దీన్, అబ్దుల్ బారి, సిరాజ్, బషీర్, షబానా మహమ్మద్, అనీఫ్, ఇమ్రాన్, నుస్రత్, ఫిరోజ్, షాకీర్ పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సులపై సదస్సు

భగత్‌నగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బస్సులు- ప్రజలపై ప్రభావం అనే అంశంపై ఈ నెల 13న ఆర్టీసీ బస్టాండ్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు విజయవంతం చేయాలని కోరారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

జమ్మికుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్-మృణాళి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని హనుమండ్లపల్లిలో గల చర్చిలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొనగంటి రవీందర్, గుల్లి సతీష్, ఇల్లందుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

శంకరపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరడపల్లి గ్రామానికి చెందిన పంజాల చంద్రయ్య అనే గీత కార్మికుడు ఇటీవల తాటిచెట్టు పైనుంచి కింద పడగా గాయాలయ్యాయి. ఆదివారం చంద్రయ్యను బీసీ ఆజాది ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాయకులు అభిలాష్, హరికృష్ణ, నవీన్, భాస్కర్, కిట్టు, రమేష్, జితేందర్ పాల్గొన్నారు.

ఓట్లు అభ్యర్థించిన ఎమ్మెల్సీ అభ్యర్థి

శంకరపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్‌కు చెందిన జనార్దన్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసి మొదటిసారిగా ఆదివారం మొలంగూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అడ్‌హక్ కమిటీ పార్లమెంట్ సభ్యుడు మోరె ప్రభాకర్‌ను కలిసి మద్దతు కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి జనార్దన్‌ను ప్రభాకర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఓట్లు అభ్యర్థిం చారు. కార్యక్రమంలో కొండయ్య, సాయికుమార్, శ్రీకాంత్, కిశోర్, అరవింద్, వినయ్, నవీన్, వివేకర్ పాల్గొన్నారు.

ధనస్వామ్య రాజకీయాలను ఓడించండి

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధనస్వామ్య రాజకీయాలను ఓడించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి అన్నారు. ఆదివారం హుజూరాబాద్‌లో టీపీటీఎఫ్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లోకి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రైవేట్ విద్యాసంస్థల అధిపతులు, విద్యావ్యాపారులను కాకుండా ఉపాధ్యాయ విద్యారంగ ఉద్యమంలో నాయకులుగా ఉండి అనుభవం ఉన్న వారికి మాత్రమే చట్టసభల్లోకి పంపాలన్నారు. ఉద్యమ నాయకుడిగా కొనసాగిన అశోక్‌కుమార్‌ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పనిచేస్తారన్నారు. సమావేశంలో ఎల్లయ్య, బాలయ్య, చంద్రశేఖర్‌రావు, హరికిషన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైలాల మల్లన్న బోనాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారం గ్రామంలో ఆదివారం మైలాల మల్లన్నస్వామికి బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా మల్లన్న దేవాలయాన్ని నిర్మించి, దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా మైలాల మల్లన్న స్వామికి బోనాలు సమర్పించి, లగ్గపట్నం, నాగవల్లి పట్నాలు వేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జమ్మికుంటలో పూర్వ విద్యార్థులు

జమ్మికుంట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1983-84సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకన్నారు. గురువులు విద్యాసాగర్, రాఘవులు, శంకరయ్యను సన్మానించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ-గణపతి, సంపత్‌రావు, మంద వెంకట్‌రెడ్డి, వట్టిపల్లి శ్రీనివాస్, గుండా సురేందర్, ప్రకాష్, వాసుదేవరెడ్డి, బలరాం, ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని విశ్వ ప్రగతి విద్యాలయం 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆకట్టుకుంది. రాజిరెడ్డి, సంపత్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని కాకతీయ హైస్కూల్‌లో 1999-2000సంవత్సరంలో 10వ తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ ఆవిర్నేని సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో ..

ఆలయ నిర్మాణనికి భూమి పూజ

వీణవంక ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో పురాతన టేకుల మల్లన్నస్వామి అలయ నిర్మాణానికి గ్రామస్థులు భూమి పూజ చేశారు. గ్రామస్తులు మాట్లాడుతు ప్రతీ ఒక్కరు ఆలయ నిర్మాణనికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ కార్యదర్శిగా రాజ్‌కుమార్

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ సంస్థ కార్యదర్శిగా అంబాల రాజ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం హన్మకొండలోని రాధా గార్డెన్స్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో రాజ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రామడుగు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం వెద్దిర గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొలుపూరి మైసయ్య (65) అనే వృద్ధుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. మైసయ్య ఆదివారం రాత్రి బస్టాండ్ నుంచి ఇంటికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా అతివేగంగా వచ్చిన బైకు ఢీ కొట్టింది. దీంతో మైసయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడిపిన వ్యక్తి పరారీలో ఉన్నాడు. మైసయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొచ్చగుట్ట మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు



అభిషేకం చేస్తున్న అర్చకులు

గంగాధర, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చగుట్ట మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఆదివారం గంగాజల సేకరణ, పుట్టబంగారం సేకరణ, మహాగణపతిపూజ, స్వస్తివాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, మంటపదేవతా ప్రతిష్ఠా, మల్లికార్జునస్వామికి పంచామృత, ఫల పంచామృత, రసపంచామృత, సుగంధ ద్రవ్యాభిషేకం, మంగళహారతి, మహా మంత్రపుష్పం నిర్వహించారు. సోమవారం మేడలదేవి, కేతకి దేవి సమేత మల్లికార్జున స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. మంగళవారం గ్రామంలో జోగెత్తుట, బుధవారం నాగవెల్లి, పట్నం, ఒగ్గు కథ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చు భక్తులకు నిర్వాహకులు ఏర్పాట్లను చేశారు.

మాజీ ప్రధాని పీవీకి నివాళులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించి ఏడాది పూర్తయిన సందర్భంగా పీవీ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ నర్సింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీవీ సేవా సమితి సభ్యులు సాగి వీరభద్రరావు, మనోజ్, విద్యాసాగర్, రత్నం, రాజిరెడ్డి, శివాజీ, సంపత్‌రావు, ప్రభాకర్, స్వామి, రాజమౌళి, శంకర్, సుధాకర్, అనిరుద్‌రెడ్డి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు





కరీంనగర్‌లో సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు, కమాన్‌పూర్‌లో..

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సందర్భంగా ఆ పార్టీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ పర్వేజ్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ చౌక్‌లో సంబరాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఢిల్లీ ఓటర్లు చరిత్రాత్మక తీర్పు ఇచ్చారన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజల చేతిలో చావు దెబ్బతిందన్నారు. కాంగ్రెస్ ఢిల్లీలో జీరో స్థాయికి పడిపోయిందని, దేశంలో కాంగ్రెస్‌కు ఇక చోటు లేదని అన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికలతో ఈ విషయం తేలిపోయిందన్నారు. బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించిన ఢిల్లీ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో పట్టభద్రుల ఎన్నికల్లోనూ బీజేపీ గెలుపు ఖాయమన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో తెలంగాణలో ఎంఐఎం ఉన్నచోట్ల గెలవబోతున్నామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి బషీరుద్దీన్, సభ్యులు తాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సమయుల్లా, ఉపాధ్యక్షులు ఫయాజ్, సయ్యద్, కార్యదర్శి సాబీర్‌షహద్, ఫైజాన్, నాయకులు రాంపాల్ సింగ్, అర్షద్, శైజాద్ పాల్గొన్నారు.

భగత్‌నగర్: ఢిల్లీలో బీజేపీ విజయంపై కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ కొత్తపల్లి రూరల్ మండల అధ్యక్షుడు కుంట తిరుపతి, కడార్ల రతన్, సోమినేని కరుణాకర్, మేరుగు మల్లేశం, బైరెడ్డి వంశీ, బోనాల పర్శరాములు, చెన్నబోయిన శ్రీనివాస్, ఆరెనరేష్, సంపత్‌చారి, ఆనంద్, అంజన్‌కుమార్, రాజకుమార్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యగిరీంద్ర స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

సైదాపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో గల స్వయంభూ మత్స్యగిరీంద్ర స్వామి జాతరకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మత్స్యగిరీంద్ర స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ సారబుడ్ల వెంకట్‌రెడ్డి సతీష్‌కుమార్‌కు శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బిడి పద్మ-అబ్బిడి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజయ్య పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ నాయకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గన్నేరువరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్లలో స్వయం భూ లక్ష్మీ గణపతి ఆలయ 14వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, కేడీసీసీ డైరెక్టర్ అలువాల కోటి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో మౌలిక వసతుల ఏర్పాటులో భాగంగా స్టీల్ రేలింగ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, శ్రీనివాసరావు సొంత ఖర్చులతో చేయించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల నియామకం

వీణవంక ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి, బొంతుపల్లి, గంగారం కాంగ్రెస్ గ్రామ కమిటీల నియామకం చేపట్టారు. మామిడాలపల్లి గ్రామ అధ్యక్షుడిగా వంతెన లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా శీలం తిరుపతి, గంగారం గ్రామ శాఖ అధ్యక్షుడిగా గుడెపు కోమాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పొన్నాల శ్రీనివాస్, బొంతుపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా జున్నుతుల కోమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చొప్పరి రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యమంలో మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, నాయకులు గంగాడి తిరుపతిరెడ్డి, సాహెబ్‌హుస్సేన్, చినాల అయిలయ్య, నల్ల కొండాల్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కూమార్, రషీద్ తదితరుల పాల్గొన్నారు.